www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 22 ఆగస్టు 2023 | 5 | కాకినాడ



పింఛను కోసం నిస్సహాయుని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రమాదంలో వెన్నుముక విరిగి, రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయి.. నా భార్య, ఇద్దరు ఆడ పిల్లలకు నేనే ఆధారం.. దయచేసి పింఛను ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్న చంద్రరావును చూసి స్పందకు వచ్చిన వారంతా కన్నీటిపర్యంతం అయ్యారు. ప్రత్తిపాడు మండలం వేలలంకకు చెందిన చంద్రరావు సోమవారం ఆటో డ్రైవర్ సాయంతో స్పందనకు వచ్చి అర్జీ ఇచ్చారు. రెండేళ్లుగా అధికారులను కలుస్తున్నా న్యాయం జరగలేదని వాపోయాడు.



స్పందనకు వచ్చిన అర్జీదారుడు

ప్రధాన పార్టీలు ప్రత్యేక హోదాపై నోరు విప్పాలి

- విభజన హామీలు అమలు చేయాల్సిందే
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో ప్రధాన పార్టీలు వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు క్షేత్రస్థాయిలో పోరాటం సాగిస్తే ప్రత్యేక హోదా సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అని ఆగస్టు 17న విశాఖపట్నం నుండి ప్రారంభమైన సిపిఐ బస్సు యాత్ర సోమవారం కాకినాడ చేరుకుంది. స్థానిక గాంధీ భవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు శ్రీనివాసరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రధాన పార్టీలు ప్రత్యేక హోదాపైన, విభజన హామీలు పైన నోరు విప్పడం లేదన్నారు. ఇవి కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో పనిచేస్తున్నాయన్నారు. అధికారం వచ్చేవరకు ఒకలాగా అధికారం వచ్చిన తరువాత ఇంకోలాగా మాట్లాడుతున్నారన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత సిఎం జగన్మోహన్ రెడ్డి తనకు పార్లమెంట్‌లో ఉన్న ఆరుగురు ఎంపీలతోనూ రాజీనామా చేయించి ఢిల్లీలో ప్రత్యేక హోదాపై ధర్నా చేశారని, తెలుగుదేశం పార్టీ ఎన్‌డిఎ ప్రభుత్వం నుండి బయటకు వచ్చి ముఖ్యమంత్రి హోదాలో ఢిల్లీలో ప్రత్యేక హోదా కోసం ధర్నా చేశారని, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక హోదాపై బయటకు వచ్చి కాకినాడ సభలో పాచిపోయిన లడ్డులు మాకు వద్దని మాట్లాడారన్నారు. కానీ ప్రస్తుతం మోడీకి భయపడి నోరు విప్పకపోవడం దారుణమన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మొన్నటి వరకు అహంకారంతో ఆకాశం వైపే చూసేదని, కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత నేల చూపులు చూస్తోందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని మెడలు వంచేందుకు సరైన సమయం ఆసన్న మైందన్నారు.

ప్రత్యేక హోదా ముగిసిన అంశం కాదు

ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని

ప్రత్యేక హోదా ముగిసిన అంశం కాదని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదే పదే ముగిసిన అంశంగా మాట్లాడుతోందని, అలాంటప్పుడు ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక హోదాను ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా సాధించే వరకు పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. విభజన హామీలు భావితరాలకు ఎంతో ఉపయోగమన్నారు. రాష్ట్రంలో ఉన్న నీచ రాజకీయాలతో ప్రత్యేక హోదా పక్కతోవ పడుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ విభజన హామీలు, ప్రత్యేక హోదా సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

పేరుకే హోదా అంశాన్ని మాట్లాడుతున్నాయి

సిపిఎం నాయకుడు దువ్వా శేష బాబ్జి

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన ప్రత్యేక హోదా కావాలని పేరుకు మాత్రమే మాట్లాడుతున్నాయని సిపిఎం నాయకుడు దువ్వా శేషబాబ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ప్రక్క ప్రత్యేక హోదా కావాలంటూనే ప్రత్యేక హోదా ఇవ్వబోనని కరాకండిగా చెప్పిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు ఏ విధంగా కలిసి ప్రయాణిస్తాయని ప్రశ్నించారు. మూడు ప్రధాన పార్టీలు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని శేషబాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అవకాశం లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్లో రాష్ట్రంలోని పార్టీలు ఏ విధంగా మద్దతు ఇస్తున్నాయో ప్రజలు ఆలోచించాలన్నారు.

విభజన సక్రమంగా జరగలేదు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బుచ్చయ్య చౌదరి

రాష్ట్ర విభజన సక్రమంగా జరగలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాజమండ్రి రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి విభజన చట్టం చేశారన్నారు. విభజనకు కారణమైన కాంగ్రెస్ పార్టీ రెండు రాష్ట్రాల్లో పూర్తిగా దెబ్బతిని పోయిందన్నారు. అదే సమయంలో కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్య నాయుడు రాజ్యసభలో ప్రత్యేక హోదాపై మాట్లాడి పదేళ్ల కావాలని చెప్పారని అయితే ఎన్నాళ్ళైనా ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రావులపల్లి రవీంద్ర, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఐఎన్‌టియుసి రాజు, సిపిఐ నాయకులు కొమ్మతి శ్రీనివాస్, ఎఐవైఎఫ్ నాయకులు పిఎస్ నారాయణ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులడు గాంధీ రాజు, పాల్గొన్నారు.

వినతులను నాణ్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందిన వినతులపై ప్రత్యేకంగా దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం, స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డిఎస్ సునీతతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పరిష్కరించవలసిందిగా ఆయా శాఖల అధికారులను కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 366 అర్జీలు వచ్చాయి.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

దళితుల శ్మశానాల సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో దళితుల శ్మశాన సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల స్మశాన అభివద్ధికి 1235 జిఒ తెచ్చినప్పటికి జిల్లాలో ఎక్కడా అమలు కాలేదన్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో శ్మశాన స్థలాలు లేక, కొన్ని చోట్ల స్థలం ఉన్నా దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాళ్ళరేవు మండలం గాడిమొగ పంచాయతీ బాబా నగర్‌లో 50 ఏళ్లుగా శ్మశానం లేక దళితులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చివరికి శవంతో ధర్నా చేసిన ఫలితంగా తహశీల్దారు స్థలం కేటాయించినా వేరే కులస్తులు అడ్డు చెప్తున్నారన్నారు. కరప మండలం గొర్రిపూడిలో దళితులకు శ్మశానం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాజులూరు మండలం కుయ్యేరులో శ్మశానం ఉన్నా దారి మార్గం లేకపోవడంతో పెద్ద సమస్యగా ఉందన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

శ్మశాన వాటిక ఏర్పాటులో అడ్డంకులు తగదు

తాళ్లరేవు : కొన్నేళ్లుగా శ్మశాన వాటిక లేక ఇబ్బంది పడుతున్న గాడిమొగ పంచాయతీ బాబా నగర్ దళిత గ్రామానికి స్మశాన వాటిక ఏర్పాటులో అడ్డంకులు తగదని పూలే ప్రజా చైతన్య వేదిక అధ్యక్షుడు చీకట్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం బాబా నగర్ గ్రామానికి కొంత మేర శ్మశాన వాటిక స్థలం చూపిస్తే ఇతరులు అడ్డంకులు పెట్టడం సబబు కాదన్నారు. దీనిపై మండల, జిల్లా స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి అధికారికంగా బాబా నగర్ గ్రామానికి ఎకరం శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్‌లో డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఇ పి.సత్య కుమారి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఫోన్ ద్వారా వచ్చిన సమస్యలను స్వీకరించారు. వివిధ సమస్యలను సంబంధించి ఫోన్ల ద్వారా ప్రజలు వివరించారు. అనంతరం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ సత్య కుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగానే డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, డిఈ లు, ఏఈ లు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌లో ఎమ్‌డి పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట జగనన్న లే అవుట్ లో చేపడుతున్న అభివృద్ధి పనులు, గృహనిర్మాణాల తీరును రాష్ట్ర హౌసింగ్ ఎండీ లక్ష్మీశా సోమవారం పరిశీలించారు. సామర్లకోట ఈటీసీ జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణాలను, మౌలిక సదుపాయాలను హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, హౌసింగ్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. నెలాఖరున సిఎం జగన్ మోహన్ రెడ్డి సామర్లకోట ఇటిసి లే ఔట్‌కు వస్తున్న నేపథ్యంలో పేదల గృహాల నిర్మాణాలు, కాలనీలో మౌలిక వసతుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ నిర్మాణాలు, పూర్తి కావాల్సిన పనుల వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్‌డి లక్ష్మీశ, దొరబాబు

పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ధర్నా


ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ స్థలాల్లో పట్టాలు ఉన్నవారు, గృహ నిర్మాణ శాఖ రుణాలతో ఇల్లు నిర్మించుకున్న వారికి వన్ టైం సెటిల్మెంట్ పేరుతో పట్టాలు రిజిస్ట్రేషన్ చేసిన ఇవ్వాలని సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం స్పందనలో కార్యాలయ ఎఒ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ 14, 15 వార్డులలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చినప్పుడు లబ్ధిదారులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారన్నారు. నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించకపోతే నియోజకవర్గ పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి కృష్ణ, మహాపాతిన రాంబాబు, భద్రరావు, కరక శ్రీను, గుడిపల్లి వెంకన్న, చిన్నమ్మడు, గొర్లి సత్యవతి, అప్పలరాజు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

కార్టూ'నిజం'





పొలంలో విద్యార్థులతో లక్ష్మీనారాయణ

రైతులను గౌరవించాలి : లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రైతన్నలను గౌరవించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయన సోమవారం సేంద్రీయ వ్యవసాయం ద్వారా మైసూర్ మల్లిక, తైవాన్ బ్లాక్, కాలాబట్టి వరి వంగడాల నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల ప్రయోజనాలను వివరించారు. మనకు అన్నం పెట్టే రైతన్నను గౌరవించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కలిగిన ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీకి చెందిన 100 విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 68 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్పందనకు ఫిర్యాదుదారుల నుంచి 68 అర్జీలు వచ్చాయని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన అర్జీదారుల నుంచి వినతి పత్రాలు తీసుకుని, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ, స్పందనకు వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి శ్రీనివాస్, డిఎస్‌పిలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వచ్చే నెల 9న జాతీయ లోక్ అదాలత్ జరుగనున్నందున రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న తగాదాలు కూడా కోర్టులకు వస్తుండటంతో కేసుల సంఖ్య పెరిగిపోతోందన్నారు. కక్షిదారుల విలువైన సమయం, ధనం కూడా వథాగా ఖర్చు అవుతోందన్నారు. లోక్ అదాలత్‌లో ఇద్దరికీ సమన్యాయం చేస్తారు కాబట్టి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

3న జెఎన్‌టియుకె ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 23న జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం కాకినాడ 15వ వ్యవస్థాపక దినోత్సవాలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్.సుమలత తెలిపారు. విసి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు అధ్యక్షతన జరిగే ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని,యూనివర్శిటీ అధికారులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, అనుబంధ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ పాల్గొంటారని తెలిపారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రౌతులపూడి

సెంట్రల్ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రౌతులపూడిలో సెంట్రల్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు జిగిరెడ్డి శ్రీను, వ్యవసాయ అభివద్ధి కమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి భాస్కర్ బాబు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిధిలో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు జరగనున్నట్టు ఎంపిడిఒ డి.శ్రీలలిత తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునేందుకు కొత్తగా ఆధార్ నమోదు చేసుకునేందుకు ఇది మంచి అవకాశం అయినందున మండల పరిధిలోని ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

శ్రామిక మహిళల భద్రత కోసం పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న బేబీరాణి

ప్రజాశక్తి-కాకినాడ

శ్రామిక మహిళల ఆర్థిక, సాంఘిక, రాజకీయ భద్రత కోసం పోరాటం చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి పిలుపునిచ్చారు. టీచర్స్ హోంలో సిఐటియు ఆధ్వర్యంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రవతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తొలుత జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. విమలా రణాదివే చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిజిహెచ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాజు తలుపులమ్మ, జీడిపిక్కల కార్మికుల సంఘం నాయకురాలు షేక్ పద్మ, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు నీరజ, మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి మాట్లాడుతూ, దేశ జనాభాలో సగభాగమైన మహిళలు ఇంటిపనికే పరిమితమైతే దేశాభివద్ధి ఎలా సాధ్యమని పాలకులను ప్రశ్నించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల జిడిపిలో మహిళల భాగస్వామ్యం 45 శాతం ఉంటే, భారతదేశంలో 21 శాతంగా మాత్రమే ఉందన్నారు. కరోనా సంక్షోభంలో యాజమాన్యాలు పని చేసే మహిళలను తొలగిస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేష్టలుడిగి చూస్తున్నాయి తప్పితే, మహిళల ఉపాధిని కాపాడే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. పనిచేసే మహిళా కార్మికులందరికీ కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతుంటే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోజుకు రూ.176 చొప్పున నెలకు రూ.4,576 ఇస్తే సరిపోతుందని జాతీయ కనీస వేతనాన్ని నిర్ణయించి తన మహిళా వ్యతిరేకతను చాటుకుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోని మహిళలందరూ ఫాసిస్ట్, మనువాద ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడటం తప్ప మరొకమార్గం లేదన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లకు అనుకూలంగా దేశంలోని ఏ రాజకీయపార్టీ కూడా ముందుకు రాలేదని, ఒక్క సిపిఎం మాత్రమే తమ అంగీకారాన్ని తెలిపిందని సుప్రీంకోర్టు చెప్పడాన్ని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను అన్ని స్థాయిల్లో ఏర్పాటు చేయడంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు దవ్వా శేషబాబ్జి, కోశాధికారి మలకా రమణ, నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు భారతి, పద్మావతి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలం లక్ష్మీ, జిల్లా కోశాధికారి రమణమ్మ , జ్యోతి, సునీత, నాగమణి, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభారాణి, జ్యోతి, మధ్యాహ్న భోజన సంఘం నాయకులు సుబ్బలక్ష్మి, కంటింజెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.కుమారి, జీడిపిక్కల కార్మికుల సంఘం నాయకులు జయలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మాచవరం గ్రామానికి చెందిన చిన్నారి కట్ట ప్రభావతికి పలువురు సోమవారం సాయం అందజేశారు. ఆమె కుడికాలికి నాలుగు ఆపరేషన్ల నిమిత్తం సుమారు రూ.5 లక్షలు అవసరమన్న విషయం సోషల్ మీడియాలో వచ్చింది. కొత్తపల్లికి చెందిన ఆదిమూలం గంగాధర్ రావు, పిఠాపురానికి చెందిన సిలామంతుల గణేష్, మాచవరానికి చెందిన సిలామంతుల శ్రీనివాస్ ప్రభావతి తల్లికి రూ.40 వేల నగదు అందజేశారు. 100 కేజీల బియ్యం, కిరాణా సామాగ్రి, కాయగూరలు అందించారు. ప్రభావతి అనారోగ్య విషయం తెలిసిన తమ స్నేహితులు ఈ మొత్తాన్ని సమకూర్చారని తెలిపారు. ఎవరైనా సహాయం చేద్దామనుకుంటే 8121434792. ఫోన్‌పే నెంబర్‌కు నగదు పంపించాలని కోరారు.

ఘనంగా ముప్పన రామారావు జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం

దక్షిణ భారతదేశంలో చేనేత రంగం అభివద్ధికి విశేష కృషి చేసిన చేనేత బంధు ముప్పన్న రామారావు 101వ జయంతి సోమవారం స్థానిక చేనేత సొసైటీల ఆధ్వర్యంలో చేనేత కార్మికులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సినిమా సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మున్సిపల్ సెంటర్ వరకు చేనేత కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ సెంటర్లోని ముప్పన రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌరికోనేరు సెంటర్లోని చేనేత వర్గాల కళ్యాణ మండపం వద్ద, భాస్కర కాలనీలోని చేనేత భవనం వద్ద ముప్పన రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు రామారావు చేనేత రంగానికి చేసిన సేవలను, 30 ఏళ్ల మున్సిపల్ ఛైర్మన్‌గా పట్టణానికి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, జెట్టి రాజబ్బాయి, పేరిశెట్టి మృత్యుంజయరావు, మున్సిపల్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, కె.విచలం, ఒబిలిశెట్టి గణేష్, బొమ్మన సత్యనారాయణ, తూతిక సత్యనారాయణ, పడాల సూరిబాబు, మల్లిబాబు, వీరభద్రరావు, శ్రీశైలం, సూర్యనారాయణ, సూర్య ప్రకాశరావు, పురుషోత్తం, మార్కండేయులు, సాంబమూర్తి, రాజు, వీరభద్రస్వామి, తూతిక చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ముప్పన రామారావుకు నివాళులర్పిస్తున్న ప్రజలు

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు తొమ్మిది ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు తెలిపారు. ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ కోసం మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ అడ్రస్ అనుసంధానం, బయోమెట్రిక్ (ఫొటో, ఐరిష్, వేలిముద్ర) అప్‌డేట్, పేరు, పుట్టినతేదీ, చిరునామాల్లో మార్పులు, ఆధార్ డౌన్‌లోడ్ చేసుకోవడం, కొత్త ఆధార్ నమోదు వంటి సేవలను ఈ శిబిరాల్లో పొందవచ్చునన్నారు.

స్పందనకు 8 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో కార్యాలయం ఎఒ సిహెచ్.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనలో డివిజన్ పరిధిలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఎఒ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఈ అర్జీలను సంబంధిత కార్యాలయాలకు పంపిస్తున్నామని, సమస్యలు పరిష్కరించిన అనంతరం అర్జీదారులకు తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, వ్యవసాయ శాఖ ఎడిఎ దైవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


బోల్తా పడిన లారీ

లారీ బైకు ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -గోకవరం

లారీ బైకు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన తిరుమలాయపాలెంలో సోమవారం చోటు చేసుకుంది స్థానికుల కథనం ప్రకారం గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామ శివారున కపస లారీ, బైకు ఢీకొనడంతో బైకుపై వెలుతున్న సామర్లకోటకు చెందిన గుకోలపురం శ్రీను (30) మిరియాల నాగ(29) అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట కెనాల్ రోడ్డులో సోమవారం వేట్లపాలెం సమీపాన రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వేట్లపాలెం వైపు నుంచి మేడపాడు వస్తున్న బైక్, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్న ఈ ఘటనలో మేడపాడుకు చెందిన గరికపాటి జితేంద్రప్రసాదు, కొంకుదురు గ్రామానికి చెందిన భార్యాభర్తలు పులి శ్రీను, దేవి గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్ లో సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

సివిల్ సప్లై గొడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం సివిల్ సప్లై గొడౌన్లో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ అధికారులు సిఐ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దారు విజయకుమార్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా కందిపప్పు, పంచదార, రేషన్ బియ్యం, పామాయిల్ నూనెతో పాటు వివిధ తనిఖీల్లో అక్రమంగా తరలించే క్రమంలో సీజ్ చేసి భద్రపరిచిన పిడిఎస్ రైసులో తేడాలు గుర్తించేందుకు సమగ్రంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 150 కేజీల బియ్యం, 70 కేజీల కందిపప్పు లెక్కల ప్రకారం స్వల్ప తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై సివిల్ సప్లై డిమ్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్‌సి జీవానందం, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్చార్జ్ (డి.టి) వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ లోవ కుమార్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కోసం ధర్నా

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్


ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు ఉద్యోగులు

రైల్వే ఉద్యోగులకు సిబ్బందికి 2004 నుండి అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సామర్లకోట సీనియర్ రైల్వే సెక్షన్ ఇంజనీర్, పబ్లిక్ వే కార్యాలయం వద్ద రైల్వే కార్మికుల ఉద్యోగులు ధర్నా ఆందోళన నిర్వహించారు. తక్షణమే నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ రైల్వే ఎంప్లాయిస్ రైల్వే మజ్దూర్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తప్పుల తడకలుగా ఉన్న నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు రైల్వే యూనియన్ నాయకులు, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యపై భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని డిసిఎల్ కార్యాలయం వద్ద సోమవారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1996లో కేంద్ర ప్రభుత్వం బిఒసి చట్టం చేసి, బోర్డును ఏర్పాటు చేసిందని, ఎపిలో 2009లో ఈ బోర్డు ఏర్పడిందని చెప్పారు. 2014 వరకు సంక్షేమ పథకాలు కార్మికుల అందుకున్నారన్నారు. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం, ఈనాటి జగన్ ప్రభుత్వం రూ.1700 కోట్ల బోర్డు నిధులను పక్కదారి పట్టించారన్నారు. బోర్డులో నిదులను వాడుకునే హక్కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, వాడుకున్న ప్రభుత్వాలు బోర్డుకి జమ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. గంటా బేతాళుడు, చవ్వాకుల రాఘవ, బండారి బాబురావు, అడపా వీరభద్రరావు, మల్లవరపు రాజు, శ్రీపాదం సత్తిబాబు, వీర్రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

పైడాలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పటవలలోని పైడా గ్రూపు విద్యాసంస్థల ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, ప్రెసిడెంట్ బాదం బాలకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రవమంలో విద్యాసంస్థల డీన్ డాక్టర్ వీరభద్రరావు స్వాగత ఉపన్యాసం చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా బాదం బాలకృష్ణ మాట్లాడుతూ 38 సంవత్సరాలుగా 87 సార్లు రక్తదానం చేశారని చెప్పారు. విద్యార్థులు ఈ వయసులో రక్తదానం చేయడం ప్రారంభిస్తే తప్పకుండా 100 సార్లు చేసి 100 మందికి ప్రాణదానం చేసి జీవితాలను కాపాడిన వారవుతార న్నారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్. రవీంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిబీల్ సురేష్, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ నాయుడు, అధ్యాపకులు రమేష్, సుమ తదితరులు పాల్గొన్నారు


మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎచినరాజప్ప

టిడిపి పాలనలోనే రాష్ట్ర పురోభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

తెలుగుదేశం పార్టీ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోభివద్ధి సాధిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక 3వ వార్డు పరిధిలో సోమవారం జరిగిన మహాశక్తి సభలో ఆయన ప్రసంగించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టిడిపి అధినేత చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ఈ సభలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఎలిశెట్టి నాని, కందుల విశ్వేశ్వరరావు, మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఐడియల్ కళాశాల వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఐడియల్ కళాశాల ఎదురుగా బస్సు సెంటర్ నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, నగర నాయకులు సాహిత్, వాసు సంయుక్తంగా మాట్లాడుతూ కాకినాడ నుంచి రాజమండ్రి వయా సామర్లకోట, పెద్దాపురం, ఏలేశ్వరం గోకవరం మీదుగా వెళ్లే ప్రయాణికుల కోసం ఐడియల్ కాలేజీ ఎదురుగా ఆర్‌టిసి బస్ స్టాప్ ఏర్పాటు చేసిందని, కానీ అక్కడ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు విద్యార్థులు ఆరుబయటే నిలబడి ఎండకు, వానకు తీవ్ర అసౌకర్యానికి గురవ్వాల్సి వస్తోందన్నారు.

రైలు టిక్కెట్ రాయితీ పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు నిలిపివేసిన రైల్వే టికెట్‌లలో రాయితీలను పునరుద్ధరించాలని వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక రామారావు పేటలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల గౌరవంతో మెలగాలన్నారు. వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కె.పుష్పాంజలి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సేవలను గుర్తించి ఆసుపత్రుల్లో వారికి అందించే వైద్య సేవలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబ సభ్యులు తమ కుటుంబంలోని వృద్ధుల పట్ల మానవత్వంతో మెలగాలన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి ఎం.భాస్కర్‌రావు, కె.సుధాకర్, టి.సత్యనారాయణ, బి.నాగ కుమారి, వి.శ్యామల ప్రసంగించారు.

యానాం వార్తలు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో జరిగిన భారీ బహిరంగ సభకు యానాం నుంచి పుదుచ్చేరికి ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లి అక్కడ పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ వైద్యలింగం, మాజీ సీఎం నారాయణసామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్లాడి సత్తిబాబు, అర్ధాని దినేష్, మల్లాడి వీరాస్వామి, దున్నా చక్రవర్తి, లంకే నాగూర్, అంజియ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

26న పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పాలనాసంస్కరణల విభాగం ఈ నెల 27న 165 ఎల్‌డిసి, 55 స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి యానాంలో పది పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో పరీక్షకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను నిర్వహించడానికి ఈ నెల 26 శనివారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ ఎడ్యుకేషన్ జెడి విజి శివగామి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల అధిపతులు సాయం అందించాలన్నారు.

యానాంలో యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణ పరిధిలో ఒక యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యుకెవి నగర్‌కు చెందిన మీసాల మౌనిక (22) తన స్వగృహంలో ఫ్యాన్‌కు చున్నీ బిగించి బలవర్మరణానికి పాల్పడిందన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు గమనించి ఆమెను యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినప్పటికే ఆమె మృతి చెందిందనట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.



వృద్ధులను సత్కరిస్తున్న సభ్యులు

వృద్ధుల సంరక్షణ పిల్లల నైతిక బాధ్యత

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వృద్ధులు ఆరోగ్యంగా, సంతోషంగా, గౌరవప్రదంగా జీవించే విధంగా చూడాల్సిన నైతిక బాధ్యత పిల్లల దేనిని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు పెన్షన్లు ఇతరులకు ఆదాయ పన్ను రాయితీలు లభిస్తున్నా రైల్వేలో మాత్రం గతంలో ఉన్న రాయితీలను తొలగించడం బాధాకరం అన్నారు. ప్రతి ఐదుగురిలో ఒకరు ఒంటరిగా జీవిస్తుంటే, ప్రతి ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతున్నారన్నారు. కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారని అన్నారు. వద్ధులు దూషణలతోపాటు శారీరిక హింసకు కూడా గురువుతున్నారని అన్నారు. నేడు మన దేశ జనాభాలో 11 శాతం మంది వృద్ధులు ఉన్నా సంరక్షణ లేదన్నారు. పాశ్చాత్య దేశాలు వద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. ఆర్థిక భద్రతను కూడా కల్పిస్తున్నాయని అన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలు వస్తే జాతీయ హెల్ప్ లైన్ 14567కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవరావు, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.


అన్నదానంలోపాల్గొన్న జ్యోతుల నెహ్రూ

పేదల ఆకలి తీర్చడమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి-జగ్గంపేట

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్టు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్‌టిఆర్ స్మారకమందిరం కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి సంతకు వచ్చే పేదలకు బూరుగుపూడికి చెందిన కుంచే సీతారామయ్య ఆర్థిక సాయంతో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పల రాజు, మారి శెట్టి భద్రం, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు రాజపూడి బుల్లబ్బు చౌదరి, రాజు, రేణు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


మట్టి తవ్వేసిన సాగునీటిచెరువు

సాగునీటి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

భావరంలో అక్రమంగా సాగునీటి చెరువుల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామంలో కొంతమంది కబ్జాదారులు ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భావరం గ్రామ పరిధిలో ఉన్న కోనేటి వారి సాగునీటి చెరువులో వారం రోజులుగా మట్టిని అక్రమంగా తరలించుకు పోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రైతులు నాగం విష్ణుమూర్తి, పదిలం బుచ్చిబాబులు మాట్లాడుతూ కోనేటివారి చెరువు వ్యవసాయం సాగుకు భయపడేదని అటువంటి చెరువులో మట్టిని జెసిబిల సాయంతో లారీల్లో తరలించకపోతున్నారన్నారు. గతంలో అధికారికంగా అనుమతులు తీసుకొచ్చామంటూ తప్పుడు పత్రాలు చూపించారన్నారు. అక్రమంగా మట్టిని తవ్వుతున్నారని వారిని అడ్డుకుంటే మాపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. ఇక తాము చేసేదిలేక ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అక్రమ తవ్వకాలు నిలిపివేసి వ్యవసాయ సాగు నీటికి ఉపయోగపడేలా చెరువులను అభివృద్ధి చేయాలని రైతుల కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారి టి శేషగిరి రావు ను వివరణ కోరగా సంఘనా స్థలానికి వచ్చి కోనేటివారి చెరువులు పరిశీలించామన్నారు. ఈ విషయమై అధికారికంగా పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు అన్నారు.

సర్పంచ్ భర్త పెత్తనంపై వార్డు సభ్యుల నిరసన

ప్రజాశక్తి-కరప

పెనుగుదురు పంచాయతీ సర్వసభ్య సమావేశంలో భర్త పెత్తనంపై వార్డు సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశానికి మహిళ సర్పంచ్ అయిన రెడ్డిపల్లి మాధవి స్థానంలో ఆమె భర్త రమేష్ హాజరు కావడంపై గ్రామస్తులు, వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి సైతం సర్పంచ్ భర్తకు వంత పాడుతూ మీడియా వాళ్లు ఎందుకు వచ్చారంటూ మీడియా పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా వాళ్ళ గుర్తింపు కార్డు లు చూపించి పంచాయతీ లోకి రావాలి అని షరతులు పెట్టారు. మీడియా వాళ్లు కార్యాలయంలోకి రాగానే వారిని చూసి సర్పంచ్ భర్త బయటకి వెళ్లిపోయారు. సర్వసభ్య సమావేశానికి పంచాయతీ మెంబర్లు కాకుండా వైసిపి నాయకులు హాజరవడం, పంచాయతీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు కాకుండా వైసిపి నాయకులు సమాధానాలు చెప్పడంపై జనసేన వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు మురళి మాట్లాడుతూ గ్రామ అభివద్ధికి ప్రజలు ఎదుర్కొంట సమస్యలకు వార్డు నంబర్లు అడిగిన ప్రశ్నలకు అధికారులు సర్పంచ్ సమాధానం చెప్పకుండా బయట వైసిపి నాయకులు కలగజేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వలసపాకలో గ్రామసభ జరపాలని వినతి

ప్రజాశక్తి-కాకినాడరూరల్

వలసపాకల,వాకలపూడి రెండు గ్రామాలకు సంబంధించిన కోరమండల్ ఇంటర్నేషనల్ టెర్మినల్ లిమిటెడ్ పరిశ్రమ, పరిశ్రమవిస్తరణకు సంబంధించి కె.సత్యనారాయణరావు, పి.వీర కుమార్ వినతిపత్రాన్ని సెక్రెటరీ, స్పెషల్ ఆఫీసర్‌కు అందజేశాఇరు.

అనంతరం మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ తక్షణమే వలస పాకల గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తున్న ప్రజలందరికీ గ్రామ సభ జరపాలన్నారు. ప్రజలకు జవాబు దారిగా ఉండాలని కోరారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ టెర్మినల్ లిమిటెడ్ ప్లాంట్ విస్తరణ 19 ఎకరాల్లో రూ.710 కోట్ల వ్యయంతో ఒకటి కొత్త నానో ఎరువులు, నానో యూరియా లేదా నానో డిఎపి అభివృద్ధి చేస్తారని, మరొక పరిశ్రమ బొగ్గు ఆధారిత పవర్ ప్లాంటు అభివద్ధి కూడా జరుగుతుందని అన్నారు. ఈ రెండు ప్లాంట్ల వల్ల వాకలపూడి వలస పాకల చుట్టుపక్కల గ్రామ ప్రజలు అనారోగ్య సమస్యలతో అనేక ఇబ్బందులు పడతారన్నారు.

ఈ పరిశ్రమల వల్ల కెమికల్, బొగ్గు, ధూళి వలన విషం చిమ్ముతుందని అన్నారు. ఇప్పటికే సముద్రపు లో చేపలు, వ్యవసాయం దెబ్బతిన్నాయి. ఇప్పటికే సూర్యారావుపేటలో పరిశ్రమల వల్ల చుట్టుపక్కల కాల్షియం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వలస పాకల గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని, భవిష్యత్తు తరాల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే వలస పాకల గ్రామంలో దండోర వేయించి గ్రామ సభ వలస పాకుల పంచాయతీలో వాచ్ పార్టీ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

'మహాశక్తి'తో మహిళలకు ఉజ్వల భవిత

ప్రజాశక్తి - పెదపూడి

అన్ని రంగాల్లో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలని టిడిపి అధినేత చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో మహాశక్తి పథకాలు ప్రకటించారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన మండలంలో కుమార ప్రియం గ్రామంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్ళి టిడిపి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తోందని ఆరోపించారు. అసలైన సంక్షేమం టిడిపితోనే సాధ్యమని వెల్లడించారు. ప్రత్యేకించి మహిళలకు మహాశక్తి పేరుతో అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వంలో ధరలు రోజురోజుకీ పెరుగుతున్నా ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. వచ్చే ఎన్నికలలో వైసిపికి తగిన గుణపాఠం చెప్పి టిడిపికి విజయం చేకూర్చి చంద్రబాబును ముఖ్య మంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి బేరా వేణమ్మ, తూర్పుగోదావరి జిల్లా మహిళా అధ్యక్షులు శేషారత్నం, పెదపూడి మండల అధ్యక్షురాలు సత్యవతి, రాష్ట్ర డ్వాక్రా, అంగన్వాడీ సాధికారిక కమిటీ ఉపాధ్యక్షురాలు సుభాషిణి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధర చౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు జుత్తుక కృష్ణ, , టీడీపీ నాయకులు శారద, తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి సానా శ్రీను పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

ప్రజాశక్తి-రౌతులపూడి

అనకాపల్లి జిల్లా బామిడికలోదు లో గల మైనింగ్ ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. సిసిఎఫ్ సర్వనన్, రాజహేంద్రవరం డిఎఫ్ఒ ఎంవి. ప్రసాద్, ఎఫ్ఆర్ఒ దుర్గా రాంప్రసాద్, ఎఫ్ఎస్ఒ నాగేశ్వరరావు తదితరుల బందం సరుగుడు లెటర్ రైట్ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు ఈ లెటర్ తవ్వకాలపై ఇటీవల ఎన్‌జిటికి ఫిర్యాదు చేయడంతో సోమవారం పరిశీలించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

'స్పందన'కు 3 అర్జీలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమం లో 3 అర్జీలు వచ్చాయని కార్యాలయం అధికారులు తెలిపారు. వాటిలో వికలాంగుల పెన్షన్ (రూ.5వేలు) మంజూరు చేయాలని, ఆక్రమణ తొలగించాలని, మురుగు నీరు పోవుటకు మార్గము కల్పించాలని అర్జీలు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమం లో ఆర్‌డిఒ పి.సింధు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అండాశయలో కంతి తొలగింపు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం కిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం ఒక బాలికకు అండాశయంలో కంతిని శస్త్రచికిత్స చేసి తొలగించారు. వివరాలు ఇవి.. మల్కిపురం కి చెందిన 12 సంవత్సరముల బాలిక కడుపు నొప్పి, వాంతులు సమస్యతో కిమ్స్ హాస్పిటల్ అత్యవసర వైద్య సేవల విభాగానికి వచ్చారు. ఆమెకు పరీక్షలు స్కానింగ్ చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ వరద, ఆ బాలిక అండా శయంలో సుమారు 17 సెం.మీ. వ్యాసం ఉన్న కంతి మెలికలు తిరిగి ఉన్నట్లు గమనించారు. సర్జరీ చేసి కంతి తొలగించాలన్నారు. సర్జరీ కొరకు అవసరమైన పరీక్షలు చేసిన తరువాత గైనకాల జిస్టులు డాక్టర్ వరద, డాక్టర్ మానస మత్తు వైద్యులు డాక్టర్ సౌమ్య లతో కూడిన వైద్య బృందం ఆ బాలికకు 'ఎక్సప్లోరేటరీ లాప్రోటమి' సర్జరీ చేసి సుమారు ఒక కిలో బరువు గల అండాశయ కంతిని విజయ వంతంగా తొలగించారు. సర్జరీ తరువాత ఆ బాలిక కోలుకుంటోందని, మూడు రోజుల వైద్య పర్యవేక్షణ అనంతరం ఇంటికి పంపుతారని గైనకా లజిస్ట్ డాక్టర్ వరద తెలిపారు. క్లిష్టమైన సర్జరీ ద్వారా కంతిని తొలగించిన వైద్య బందాన్ని కిమ్స్ చైర్మన్ కెవివి.సత్య నారాయణ రాజు, ఎండి రవి కిరణ్ వర్మ, కిమ్స్ డీన్ డా.ఆనంద్ ఆచార్య అభినందించారు. డాక్టర్ వరద మాట్లాడుతూ చాల మంది స్త్రీలు అవగా హనా లోపం వల్ల ఇటువంటి సమస్యలకు గురవుతు న్నారని, అశ్రద్ధ చేయ కుండా డాక్టర్‌ను సంప్ర దించి తగిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా తొలి దశలో తెలుసు కొని చికిత్స చేయించుకునే అవకాశం ఉందన్నారు.